క్లుప్తంగా

నేడు గంగాభవానీ రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబళం పంచాయతీ మజర గ్రామమైన బాపురంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి రథోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ మఠం పీఠాధిపతి బసలింగమ్మవ్వ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, గంగాపూజ, గణారాధన, కుంభ తీర్థము వంటి ప్రత్యేక పూజల అనంతరం మహా మంగళహారతులు ఉంటాయన్నారు. సాయంత్రం నందికోలసేవ, గంగామాత రథోత్సవం కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు.

ఎండుమిర్చికి కనీస మద్దతు ధర ప్రకటించాలి

ఆదోని రూరల్: రైతులు పండించిన ఎండుమిర్చికి కనీస మద్దతు ధర రూ.25 వేలు ప్రకటించాలని రైతు సంఘం నాయకులు లక్ష్మిరెడ్డి, నియోజకవర్గ సమితి ప్రధాన కార్యదర్శి బసాపురం గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన ఎండుమిర్చి ధర పూర్తిగా పడిపోయిందన్నారు. దీంతో మిర్చి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఎండుమిర్చి రైతులను ఆదుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ రంగానికి జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానం చేయాలని, ఎకరాకు 50 మంది వ్యవసాయ కూలీలను తక్షణమే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు కాతే భీమన్న, అంజిత్‌గౌడ్, రమేష్, తమ్మిరెడ్డి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ప్రధాన రహదారులగుండా మున్సిపల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తూ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. కె.అజయ్‌బాబు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా కార్మికులకు రావాల్సిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై.టి.భీమేష్, వెంకన్న, నాయకులు ఎస్.సుదర్శన్, రాజు, షేక్షావలి, హుసేని తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్, హౌసింగ్‌బోర్డు అధికారులు

ఆదోని టౌన్: ఎన్టీఆర్ కాలనీలో పక్కా గృహాల నిర్మాణం పనులను వేగవంతంగా చేపట్టాలని, నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ సూచించారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో ఎన్టీఆర్ కాలనీలో జరుగుతున్న పక్కా గృహాల నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. 460 ఇళ్లకు గానూ 300 ఇళ్లు పూర్తి అయ్యాయని, 61 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని కమిషనర్ తెలిపారు. వారం రోజుల్లోగా పూర్తి చేయాలని హౌసింగ్‌బోర్డు అధికారులను ఆదేశించారు. జియో ట్యాగింగ్ చేస్తూ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో హౌసింగ్‌బోర్డు, మున్సిపల్, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని రూరల్: పట్టణంలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు న్యాక్ శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ బి.జి.ఉలిగన్న, నైపుణ్యాధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే న్యాక్ శిక్షణ కేంద్రంలో యువతీ, యువకులకు అసిస్టెంట్ సర్వేయర్ కోర్సును అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజుల శిక్షణ కాలంలో ప్రాక్టికల్స్, థియరీ, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సర్టిఫికెట్ అందజేయడం జరుగుతుందన్నారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాలకు 91774 13642, 93970 31486, 99891 09688 నంబర్లను సంప్రదించాలన్నారు.

బ్రిడ్జీలకు మోక్షమెప్పుడో?

- భారీ వర్షాలకు కూలిన ఉప్పరహాల్ వంక బ్రిడ్జి
- కౌతాళం- బదినేహాల్ రహదారిలో కూలిపోయిన కల్వర్టులు
- నెలలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోని వైనం
- గ్రామీణ ప్రజలకు తప్పని అవస్థలు


కూలిపోయిన ఉప్పరహాల్ వంక బ్రిడ్జి


మరో చోట కూలిపోయిన దృశ్యం

కౌతాళం: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని ఉప్పరహాల్ గ్రామానికి వెళ్లే బ్రిడ్జి భారీ వర్షాలకు కోతకుగురై ఆరునెలలైనా మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజల ప్రమాదకరంగా ఆ బ్రిడ్జిపై నుంచి ప్రయాణం సాగించాల్సి వస్తోంది. అదేవిధంగా బదినేహాల్ రహదారిలో కల్వర్టులు కొన్నిచోట్ల కుంగిపోగా, మరికొన్ని చోట్ల కూలిపోయాయి. అధికారులు పరిశీలించి వెళ్లినా చర్యలు శూన్యమని, బ్రిడ్జి పూర్తిగా కూలిపోయేదాకా ప్రభుత్వం, అధికారులు స్పందించరా అంటూ ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరో చోట కూడా కూలిన బ్రిడ్జి

మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామానికి వెళ్లే రహదారిలో వంకకు ఉన్న బ్రిడ్జి 2024 ఆగస్టు 20న కురిసిన భారీ వర్షానికి నీళ్ల తాకిడికి సగం కొట్టుకుని పోయింది. ఇప్పటి వరకు దీనికి మరమ్మతులు చేపట్ట పోవడంతో ఇటీవల మరో చోట బ్రిడ్జి కూలిపోయింది. కౌతాళం నుంచి ఉప్పరహాల్, కుంటనహాల్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. నిత్యం ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం ప్రయాణం సాగిస్తుంటారు. గత ఐదు నెలల నుంచి ఒక పక్కనే ఉన్న రోడ్డుపైనే భయంభయంగా ప్రయాణం సాగిస్తున్నారు ప్రయాణికులు, రైతులు.

కూలిపోయిన కల్వర్టులు

మండల కేంద్రమైన కౌతాళం నుంచి బదినేహాల్ గ్రామానికి వెళ్లే 9 కిలోమీటర్ల పంచాయతీరాజ్ శాఖ ప్రధాన రహదారిలోని కల్వర్టులు పలు చోట్ల కూలిపోయాయి. దీంతో ఈ రోడ్డుపైన వాహనాలు తిరగడం లేదు. కల్వర్టు కూలిపోయిన అధికారులు మరమ్మతులు చేపట్టక పోవడంతో రైతులే ఆ కల్వర్టు వద్ద గ్రావెల్ వేసుకుని తమ పంట పొలాలకు ట్రాక్టర్లు, ఎద్దుల బండులు వెళ్లే విధంగా చేసుకున్నారు. బదినేహాల్ గ్రామం వద్ద ఉన్న కల్వర్టు, కౌతాళం దగ్గర ఉన్న కల్వర్టులు పూర్తిగా కూలిపోవడానికి సిద్ధంగా ఉండడంతో ప్రయాణం చాల కష్టంగా మారింది. బదినేహాల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ఉండడంతో నిత్యం ప్రజలు వివిధ పనుల వెళ్లవలసి వస్తుంది. అలాగే బదినేహాల్ గ్రామస్తులు మండల కేంద్రానికి కార్యాలయాలకు వివిధ పనులకు రావాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని గతంలో ఆదోని నుంచి బదినేహాల్ మీదుగా కౌతాళానికి 8 సింగల్స్ బస్సు తిరిగేది. అయితే రాను రాను రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో బస్సు సర్వీసును రద్దు చేశారు. ఇప్పటికైన ఈరోడ్డును బాగు చేయాలని కౌతాళం -బదినేహాల్ గ్రామస్తులు కోరుతున్నారు.


దారి పొడవునా కల్వర్టుల పరిస్థితి ఇలాంటిదే

నివేదికలు పంపినా స్పందన కరువు

ఇప్పటికే ఆర్అండ్‌బీ అధికారులు, ఆదోని సబ్ కలెక్టర్ కూడ బ్రిడ్జిని పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదికలు పంపించారు. అయినా ప్రభుత్వం నుంచి కరువవ్వడంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇటూ పక్క కూడా బ్రిడ్జి కూలిపోతే రాపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జికి తాత్కలిక మరమ్మతులు లేదా నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరు

బ్రిడ్జి విషయంపై ఆర్అండ్‌బీ ఏఈ సాయిసురేష్‌ను సంప్రదించగా ఉప్పరహాల్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని పనులు ప్రారంభించడానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, ఇస్మాయిల్, సీఐటీయూ నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. సోమ వారం మున్సిపల్ వర్కర్లతో కలిసి వారు మాట్లాడారు. ఎన్నికల ముందు కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా నేటికి కార్మికుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. ఆయా సమస్యలపై 5వ తేదీన నిర్వహిస్తున్న చలో విజయవాడ మహా ధర్నా కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సల్మాన్, ఖాజాబి,రంగస్వామి, పౌలురాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని అర్బన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని దివ్యాంగుల పరిరక్షణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కమతం వెంకటేష్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఆదోని గడ్డపైనే పుట్టానని, ఆదోని ప్రాంత సమస్యలు ఏవైనా ఉంటే తనదృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి పోరాడతానన్నారు. త్వరలోనే ఆదోని ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ పోరుబాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికే పీజీఆర్ఎస్


ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ కార్యక్రమం అని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, డీఎల్‌పీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, డిప్యూటీ డీఈఓ వెంకటరమణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి కృషి

కౌతాళం: మండల ప్రజలకు వైద్య సేవలు అందేలా వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. సోమవారం మండల కేంద్రంలో భాజపా మండల అధ్యక్షుడు యంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఆదోని డివిజన్ ఇన్‌చార్జ్ పురుషోత్తమ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ త్వరలో మంత్రిని మండలానికి తీసుకువచ్చి 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేయిస్తామని తెలిపారు. సమావేశంలో కౌతాళం, కోసిగి మండలాల అధ్యక్షులు యంకన్న, రాముడు మండల భాజపా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

నందవరం : మండల కేంద్రంలోని నందవరం బీసీ కాలనీలో భర్త వేధింపులు భరించలేక వివాహిత చందన అలియాస్ చాంద్ బీ(19) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. నందవరం గ్రామానికి మసాలా వహీద్‌కు 9 నెలల క్రితం పెద్దకడబూరు మండలం, తారాపురం గ్రామానికి చెందిన పింజరి చందన అలియాస్ చాంద్ బీని ఇచ్చి వివాహం చేశారు. వివాహం చేసినపటి నుంచి భార్య, భర్తలు తరచూ గొడవ పడేవారు. అత్తమామలు మసాలా రజియా, మసాలా ఖాజాతో పాటు భర్త వహీద్ కూడా వేధించేవారు. ఈ క్రమంలో ఈ నెల 1న కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పంచాయతీ చేసి భార్య భర్తలకు గొడవలు పడొద్దని సర్ది చెప్పారు. అయితే సోమవారం చాంద్‌బీ భర్త, అత్తమామలు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం వరకు చందన(చాంద్ బీ) ఇంట్లో పనులు చేసుకుంది. సాయంత్రం ఇంటి పైకప్పు ఉన్న ఇనుప రాడుకు చీర ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. బయట నుంచి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి ఇరుగు పొరుగు వారికి సమాచారం అందించారు. అనంతరం పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోర్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు కేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు.

కెనరా బ్యాంక్‌లో చోరీ యత్నం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సోమప్ప సర్కిల్ సమీపంలోని కెనరా బ్యాంక్‌లో ఆదివారం అర్ధరాత్రి ఓ దొంగ చోరీకి యత్నించాడు. బ్యాంక్ కిటికీ నుంచి లోపలికి ప్రవేశించి లాకర్ వైర్లను కట్ చేసి చోరీకి ప్రయత్నించగా వీలుకాకపోవటంతో వెనుతిరిగి పోయాడు. ఉదయం బ్యాంక్‌కు వచ్చిన ఉద్యోగులు చోరీకి యత్నించినట్లు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్‌లు బ్యాంక్‌కు చేరుకొని వైర్లు కట్ చేసింది, ఆగంతకుడు పారిపోయిన దృశ్యాలను సీసీ కెమెరాలో పరిశీలించారు. బ్యాంక్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వి. శ్రీనివాసులు సోమవారం తెలిపారు.

తమ్ముడిపై అన్నల దాడి

ఆదోని రూరల్: ఆస్తి విషయంలో తమ్ముడిపై అన్నలు దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబలం ఎస్ఐ మహేష్‌కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన పింజారి శేఖన్నపై అన్నలు సుభాన్, దివాన్, వదిన శేఖరమ్మ దాడి చేయడంతో గాయాలయ్యాయన్నారు.చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పోక్సో కేసు నమోదు

కౌతాళం: కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చూడి గ్రామానికి చెందిన పెద్ద మారెప్పపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. ఇంటి పక్కన ఉన్న మూడు సంవత్సరాల పాప ఆడుకుంటుగా పెద్దమారెప్ప లైంగిక దాడికి పాల్పడ్డాడని పాప తండ్రి ఇచ్చిన ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: దేవనకొండ మండలం కరిడికొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(40) ట్రాక్టర్‌పై నుంచి కింద పడి సోమవారం రాత్రి మృతిచెందాడు. తాలూకా ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవనకొండ మండలం కరిడికొండ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు నాపరాతిబండలు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే పనిలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కరిడికొండ గ్రామం నుంచి ఆదోని మండలం విరుపాపురం గ్రామానికి నాపరాతి బండలను ట్రాక్టర్‌లో లోడు చేసుకుని అన్‌లోడ్ చేసేందుకు వెళ్లారు. విరుపాపురం అన్‌లోడ్ చేసిన తర్వాత తిరిగి గ్రామానికి వస్తుండగా విరుపాపురం గ్రామ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీలో ప్రయాణిస్తున్న వెంకటేశ్వర్లు, కుమార్ కింద పడిపోయారు. వెంకటేశ్వర్లకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. కుమార్ గాయాలపాలయ్యాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య గౌతమి, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సబ్సిడీ రుణాలు


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న స్టేట్ బ్యాంక్ మేనేజర్ కార్తీక్

కోసిగి: అర్హతే ప్రామాణికంగా సబ్సిడీ రుణాలు అందజేస్తామని కోసిగి స్టేట్ బ్యాంక్ మేనేజర్ కార్తీక్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 50 యూనిట్స్‌కు గానూ రూ.94,50,000 సబ్సిడీ రుణాలు కేటాయించినట్లు తెలిపారు. మండలంలోని స్టేట్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్ పరిధిలో మండలంలోని 26 గ్రామాల నుంచి 526 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్‌సీ, ఐఆర్ అమలు, పెండింగ్ డీఏ బకాయిల చెల్లింపును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడెట్‌లో పూర్తిగా విస్మరించిందని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ ఇప్పటికే 20నెలలు ఆలస్యమైందన్నారు. పీఆర్సీ, ఐఆర్,డీఏలపై బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత లేదన్నారు. విద్యారంగానికి గత విద్యాసంవత్సరం 10.15 శాతం నిధులు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 9.86 శాతం కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు బసవరాజు, బాబయ్య, యల్లప్ప, చంద్రశేఖర్, వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: పట్టణంలో టిడ్కో గృహ సముదాయం వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్ నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణాధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నాగరాజు, వెంకటేష్ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టిడ్కో గృహాల నిర్మాణం కోసం అప్పట్లో రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అయితే టిడ్కో గృహాల నిర్మాణం కోసం కాకుండా సంబంధిత కాంట్రాక్టర్ ప్రైవేట్ వ్యక్తుల బిల్డింగ్ నిర్మాణాల కోసం కాంక్రీట్ తయారు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

కోసిగి: శ్మశానంలో పనిచేసే కాటికాపరుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కులవివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) మండల కార్యదర్శి హనుమంతు కోరారు. సోమవారం కాటికాపరుల సమస్యలపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి స్థానిక తహసీల్దార్ రుద్రగౌడకు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లకు వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ శ్మశానంలో వృత్తి చేస్తున్న కాటికాపరులకు గుర్తింపు కార్డులు ఇచ్చి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. నెలకు రూ.8వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ మండల నాయకులు రాముడు, వీరేష్, కేవీపీఎస్ సంఘం నాయకులు జేజప్ప, ఈరన్న, ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం ఎంపీడీఓగా సత్యన్న


ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్న సత్యన్నను సన్మానిస్తున్న సిబ్బంది

కౌతాళం: కౌతాళం ఎంపీడీఓగా సత్యన్న బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న సుబ్బారాజు గత నెల 28న పదవీ విరమణ పొందారు. దీంతో ఇక్కడ ఖాళీగా ఉన్న ఎంపీడీఓ బాధ్యతలను ఇదే కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న సత్యన్నకు అప్పగిస్తూ జిల్లా ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది పూలమాలతో ఆయనను సన్మానించారు. ఇదిలా ఉండగా ఈయన కూడా ఈనెల 31న పదవీ విరమణ పొందనున్నారు.

సారాను నిర్మూలిద్దాం


కపటిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కె.సైదుల్

ఆదోని రూరల్: సారాను నిర్మూలించి గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎస్.కె. సైదుల్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కపటి గ్రామంలో నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నాటుసారా తయారీ, అమ్మకాలపై గ్రామస్తులతో ప్రత్యేకంగా సభ నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో నాటుసారా, అక్రమ మద్యం అమ్మకాలు జరపడం వల్ల ప్రజలు వాటికి అలవాటు పడి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఈ విషయాన్ని గమనంచి తమంతకతాము స్వచ్ఛందంగా సారా తయారీ, విక్రయం బంద్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కీర్తన, ఉప సర్పంచ్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఇష్టారాజ్యంగా లోకల్ హాలిడేస్

కోసిగి: మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో ఎలాంటి పండుగలు లేక పోయినా ఇష్టారాజ్యంగా లోకల్ హాలిడేస్ ప్రకటించుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ ఆరోపించారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత నెల ఫిబ్రవరి 26న మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని సెలవు ప్రకటించారు. 27న మరుసటి రోజు మండలంలోని 29 పాఠశాలలు లోకల్ హాలిడే ఇచ్చుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి పండుగలు లేకున్నా ఉపాధ్యాయులు ఇష్టానుసారంగా లోకల్ హాలిడేస్ పేరుతో సెలవులు ప్రకటించుకుంటున్నారన్నారు. ఈ విషయం ఎంఈఓ-1 మెయినుద్దీన్‌ను పాఠశాలలకు సెలవును ఎలా ఆమోదించారని అడుగగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ఆయన ఇన్‌చార్జ్ కావడంలో మండలానికి సక్రమంగా రావడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన పై చర్యలు తీసుకోవాలని, మండలానికి రెగ్యూలర్ ఎంఈఓను నియమించాలని కోరారు. ఇందులో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి అంజి, పురుషోత్తం, రాము, అశోక్ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.3లక్షల విరాళం


నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే బంధువులు

కౌతాళం: మండల పరిధిలోని తుంగభద్ర నది ఒడ్డున్న మేళిగనూరు గ్రామ సమీపంలో వెలసిన రామలింగేశ్వరస్వామి దేవాలయానికి కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప ఎమ్మెల్యే బి.ఎం.నాగరాజు రూ.3లక్షల విరాళం ఇచ్చారు. స్వామి వారి రథచక్రాల తయారీ కోసం ఎమ్మెల్యే విరాళాన్ని అందించినట్లు పాల్తూరి మఠం పీఠాధిపతి వీరయ్య స్వామి తెలిపారు. ఈ నగదును సోమవారం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు మణికంఠ, వులిగయ్యతో కలిసి పీఠాధిపతికి అందజేశారు. వీరికి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు.



పీఠాధిపతి అనుగ్రహ ప్రశస్థి అవార్డు అందుకుంటున్న ఐపీఎస్ అధికారిణి శోభ, సిద్ధాంతి ప్రసాద శర్మ

గురు వైభవం

మంత్రాలయం : గురుభక్తి వైభవోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. మూడవ రోజు సోమవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు గావించారు. సాయంత్రం యోగీంద్ర మంటపంలో పలువురు ప్రముఖులకు రాఘవేంద్రుల అనుగ్రహ ప్రశస్థి అవార్డులు ప్రదానం చేశారు. కడప సిద్ధాంతి ఇంద్రకాంతి ప్రసాద శర్మ, బళ్లారికి చెందిన గురురాజ కులకర్ణి, ఏపీ బీజేపీ నేత పాటూరి నాగభూషణం, బళ్లారి ఐపీఎస్ అధికారిణి శ్రీమతి శోభ, కార్డియాజిస్టు (బెంగళూరు) నటరాజశెట్టికి అవార్డులు అందజేశారు. బెంగళూరుకు చెందిన అన్విత్ ప్రియ భరతనాట్య ప్రదర్శన, బెంగళూరు ప్రహ్లాద ఆచార్ మ్యాజిక్ షో ఆకట్టుకున్నాయి.

గడువులోగా పన్ను వసూళ్లు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: గడువులోగా పట్టణంలో ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. సోమవారం మున్సిపల్ సమావేశ భవనంలో వార్డు పరిపాలన కార్యదర్శులు అమెనిటి సెక్రటరీలతో ఆస్తు పన్ను, కుళాయి పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది పన్ను వసూళ్లపై దృష్టి సారించి వాటి వసూళ్లపై దృష్టి సారించి వంద శాతం వసూలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఆర్ఓ అస్లాంబాషా, డీఈ నీరజ, ఏఈ శరత్‌చంద్ర, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సూరిబాబు, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సర్పాల సయ్యాట!



కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో గ్రామ సమీపంలోని ఒక ప్రైవేట్ పాఠశాల పక్కన సర్పాల సయ్యాట సాగింది. సోమవారం ఉదయం సుమారు రెండు గంటలకు పైగా రెండు పాములు ఒక దానిపై ఒకటి పడుతూ లేస్తూ చేసిన నాట్యం చేశాయి. అక్కడున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, రైతులు ఆసక్తిగా తిలకించారు. పాముల విన్యాసాలను పలువురు ఫోన్లలో ఫోటోలు, వీడియోలు చిత్రీకరించి తమ తమ మిత్రులకు షేర్ చేసుకున్నారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.